# మినీ కథ

## పని మనిషి స్వగతం

ఎస్.కె. మూర్తి




"ఎల్లొస్తానమ్మగారో !" ఆదెమ్మ కేక.

పనులన్నీ పూర్తిచేసి తొందరగా వెళ్ళిపోతున్న ఆదెమ్మ వైపు తీరుబడిగా చదువుకుంటున్న రామారావు పేపర్లోంచి చూసి—

"ఏం ఆదెమ్మా! రాత్రి ఎవరిమీదో కేకలు వేస్తున్నావు?"

"ఉన్నాడుకదా! ఆ ముదనష్టపోడు. ఆ అప్పలసోమి. ఆడితో." "పేటకి పెద్దమనిషి కదా! అతనితో తగువేమిటి?"

"ఆడా? ఆడా పెద్దమనిషి బావూ! మీరు కొత్తగా ఒచ్చినారుగదా: అందుకే ఆడి సంగతి మీకు తెలవదు."

"మొదట ఆడూ. మా యింటి మగాడూ మిల్లులో కలాసీలే బావూ! యీడు కలాసీ పని చేస్తూ. మిల్లు గుట్లన్నీ దొంగ యెదవలకి చెప్పి. రాతిరి ఆళ్ళు బస్తాలకి బస్తాలు దొంగిలించిన దాంట్లో సగం వోటా తీసిగొనేవాడు బావూ. యీడి పెళ్ళాంనేదా! అదో రాకసి నంజ. యీడు తెచ్చి పోస్తే పెద్దరికం దాంది. అది డబ్బు వడ్డీలకు వడ్డీలు తిప్పి. మడి చెక్కలకు మడిచెక్కలు కొన్నారు బావూ! అంతే కాదు. ఆది మిరపకాయల సావుకారు ఉండేవాడు. ఆడ్నిపడేసుగొని ఆడి డబ్బంతా లాగేసింది. ఆడేమో డబ్బంతా దీనికిపోయీసి. పకీరై పోయి యీ ఊరొదిలి పోనాడు. ఆ యిదంగా యీళ్ళు పెద్దోళ్ళయి పోనారు.-యీళ్ళెలాంటి వోరో యీ పేటలో అందరికి తెల్చు. డబ్బునోళ్ళు కదా! అంచేత యీళ్ళని ఎవ్వరూ. యేటీ అనలేరు. యీళ్ళిద్దరూ నాకు నీతులు సెప్తారా! నాకేటి? ఒంటికట్టంమీద బతికేదాన్ని. యీళ్ళ లచ్చెం నాకేటి? అందుకే కడిగేసినాను."

"అసలింతకీ ఏం జరిగింది?"

"యీ రోజు ఎలచ్చనుకదా! నిన్న రోజు కనకయ్య బావు ఓటుకి 5 రూపాయలు యిమ్మని యీ అప్పలసోమికి యిచ్చినాడు. మా యింటిలో అయిదుగురంఉన్నాం. మాకు యిఁవై అయిదు యివ్వాల. యీడేమో 15 యిచ్చి 10 ఉంచీసిగున్నాడు-యిలా ఎంత సొమ్ము ఉంచుగున్నాడో. నేను నిలదీసి అడిగినాను. దాంతో ఆడు, ఆడిపెళ్ళాం నా మీద కయ్యానికి ఒచ్చేరు. దాంతో నాకు చిర్రెత్తి ఆళ్ళని. ఆళ్ళ ఒంశాన్ని కడిగేసి ఎండబెట్టేసినాను. దాంతో ఆళ్ళు తోక ముడిసి యింటిలోకిపోనారు. ఊరుకున్నానా ఆ కనకయ్యబావుకాడకెళ్ళి యీళ్ళయవ్వారం సెప్పినాను- దాంతో అతనొచ్చి నాలుగు చీవాట్లేసి నా 25 నాకిప్పించినారు."

"నీ భర్త నీకేమీ ఆస్తి మిగల్చ లేదా?"

"ఎందుకు మిగల్చ నేదూ! అయిదుగురు పిల్లల్ని. ఆడి ముసలి తల్లిని మిగిల్చి ఆడి మానాన ఆడు ఎల్లిపోనాడు. కాని బావూ! బతికినంతకాలం చాల కరట్టుగా బతికినాడు. కలాసీ పని సేసినా ఎప్పుడూ ఎవరికి ఏ అన్నేయం చేయనేదు. యీ అప్పలసోమి చెడ్డ పనులకి అసయ్యం యేసి మొగం మీదే ఉమ్మేసే వాడు బావూ. యీడంటేనే గొప్ప అసయ్యం బావూ: యీడికి సిగ్గేటి. యీడికి డబ్బే వేదానం. నా మగాడు అందరిదగ్గర గోవరవంగాబతికేవోడు. కాని యేటి నాబం. పగలంతా పనిచేసి అలిసిపోయేవాడు. రాత్రి నొప్పులు తగ్గడానికి చుక్కేసిగానేవాడు. ఒంట్లో సత్తువుడిగేసరికి పని సేయనేక, ఎసనం ఎక్కువై. దాంతో చే పోయినాడు. బెంగెట్టుగొని యింట్లో కూకుంటే పిల్లలికి గంజెవరుపోత్తారు. అందుకే దైన్నం తెచ్చిగొని మీలాంటోళ్ళ ఇళ్ళల్లో అంట్లు తోమి. పిల్లలకి. ముసిలిదానికి గంజి పోత్తన్నాను- పెద్ద పిల్లలిద్దరికీనీ యిద్దరయ్యల చేతిలో పెట్టీసినాను— యింకా రెండోచి కాపురానికి యెళ్ళలేదు. పెళ్ళికోసం నాయుడోర్లు కాడ చేసిన అప్పులు తీర్చలేక యిద్దరి మగపిల్లల్ని ఆళ్ళ రెండిళ్ళ కాడ కంబారితనానికి ఎట్టేసినాను- ఆళ్ళు ఆళ్ళ ఒడ్డిలు కింద తీసిగోగా మిగిత్తే యిస్తున్నారు లేకపోతేలేదు- ఆళ్ళ అప్పులు ఎప్పుడు తీరతాయో, ఆళ్ళ చెర ఎప్పుడు యిడుదలవుతాదో. ఆళ్ళు అందరినాగ సొతంత్రంగా ఎప్పుడు తిరుగుతారో అనేఆలోచిస్తుంటాను బావూ! మీకు చెప్పకేం బావూ! యిల్లు జరక్క ఆఖరిది అప్పిని కూడా పనిలో పెట్టీసినాను బావూ. దానికి నిండా పదేళ్ళు లేవు బావూ! నా బాదలు ఎవురితో చెప్పుగోను బావూ!"

"ఆదెమ్మా! నీ కథంతా విన్నాను-కాని డబ్బు పుచ్చుగొని ఓటు వెయ్యడం తప్పు కదా! మంచి నిజాయితీపరుడు. మీ కష్టసుఖాలు తెలిసేవాడ్ని యెన్నుకుంటే మీ వార్డు బాగుపడుతుందికదా!"

"నిజమే! నా చిన్నప్పుడు మా అయ్య కూడా చెప్పేవోడు. మనకి సొరాజ్జంఒత్తాది. మన బతుకుల్లో బంగారం పండుతాది అని. నిజమే గావాల అని నేనూ సంబరపడేదాన్ని. అదే ఆశతో 35సంవత్సరాలాయ ఓట్లుయేసి యేసి యిసిగిపోనాను. కాని మా బతుకులికి బంగారం మరి రానేదు బావూ! మా యమ్మ అంట్లుతోమి నన్ను పెంచింది. నేను అంట్లుతోము కొని బతుకుతున్నాను చూత్తున్నారు కదా? మా ఆకరు పిల్ల అప్పినికూడా పనిలో పెట్టీసినాను. అదికూడా దానిపిల్లల్ని. దాని పిల్లలు....

మా బతుకులన్ని అంట్ల బతుకులే అయినాయిగాని బంగారం బతుకు లవనేదుబావూ! ....అందుకే ఆకరిదానికి గుడ్డ ముక్కలకేనా పనికొత్తాది కదాఅని ఆ డబ్బు తీసిగున్నాను. మంచో, చెడ్డో, యేదో—అం.... మాటల్లో పడి మరచిపోనాను, కాలేజీ గుమత్తా గారింటికి యెల్లాల. ఆలెస్సెం చేత్తే ఆ యమ్మ రంకేత్తాది. ఎల్లొత్తాను బావూ!"